# పటాన్‌చెరులో బీఆర్ఎస్‌దే విజయం




సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు

## డిసెంబర్ 3న ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అవుతది
## ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం ఖాయం
## అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శం
## బీఆర్ఎస్ నాయకులు

పటాన్‌చెరు, నవంబర్ 8: డిసెంబర్ 3న ప్రతిపక్ష పార్టీల మైండ్ బ్లాక్ అవడం ఖాయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వివిధ పారిశ్రామికవాడలనుంచి కార్మికులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి మాజీ చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సఫానదేవ్, శంకర్‌యాదవ్ గులాబీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో, నియోజకవర్గ ప్రజల దీవెనలను కోరుతూ ఈ నెల 9న నామినేషన్లు వేస్తున్నానని చెప్పారు. తొమ్మిదేండ్లలో తాను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిపారన్నారు. గుజరాత్ రాష్ట్రం నమూనా అంటున్నవారు అక్కడ విద్యుత్ కోతలు అనుభవిస్తున్నారన్నారు. తెలంగాణలో ఒక్కరోజు కూడా కరెంట్ పోదని తెలుసుకోవాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. రూ.9 వేల కోట్ల అభివృద్ధి చేశామన్నారు. కులం, మతం పేరుతో రాజకీయం చేయడం తనకు రావన్నారు. నియోజకవర్గంలో 180 వరకు దేవాలయాలు నిర్మించానని, బీజేపీ వారు ఒక్క గుడికైనా సున్నం వేశారా.? అని ప్రశ్నించారు. మత రాజకీయం చేయడం తప్ప వారికి అభివృద్ధి పట్టదన్నారు. గుడులతోపాటు మసీదులు, ఈద్గాలు, చర్చిలను నిర్మించి అన్ని వర్గాలకు న్యాయం చేశానన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించామన్నారు. కరెంటు సమస్యల పరిష్కారానికి నూతన సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. మినీ ఇండియాలో 29 రాష్ట్రాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. వారందరికీ సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం ఇస్తున్నామన్నారు. మరోమారు మీ ముందుకు వచ్చానని ఈ నెల 30న మీ ఓటును కారు గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సఫానదేవ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశంగౌడ్, కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్‌యాదవ్, ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, సోమిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కొలన్‌బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, గూడెం యాదమ్మ, గూడెం మధుసూధన్‌రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జడ్పీటీసీలు సుప్రజావెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీశైలంయాదవ్, యాదగిరియాదవ్, వంగరి అశోక్, శ్రీధర్‌చారీ, అఫ్జల్, అక్రం పాష, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉపేందర్‌ముదిరాజ్, సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కారు గుర్తుకు ఓటేసి గెలిపించండి

– రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్

సీఎం కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరాను. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. బీసీ బంధువులంతా కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనిపిస్తున్నది. పదేండ్లలో పటాన్‌చెరు ప్రాంతం చక్కగా అభివృద్ధి చెందింది. బీఆర్ఎస్ శ్రేణులు 20రోజులు కష్టపడితే పటాన్‌చెరులో రికార్డు మెజార్టీతో మహిపాల్‌రెడ్డిని గెలిపించుకోవచ్చు. ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా సీఎం కేసీఆర్‌కు ఓటేయాలి.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్

### ప్రజల్లో ఉండే నాయకుడు మహిపాల్‌రెడ్డి

– శాసనమండలి మాజీ చైర్మన్ వీ.భూపాల్‌రెడ్డి

ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండే నాయకుడు గూడెం మహిపాల్‌రెడ్డి. సీఎం కేసీఆర్ మూడోసారి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువస్తారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మూడోసారి రికార్డు స్థాయి మెజార్టీతో గెలుస్తారు. పరిశ్రమలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన సాయంతో కార్మికులకు చక్కగా ఉపాధి లభిస్తున్నది. ఎమ్మెల్యే ఇక్కడ చేసిన పనులే ఆయనను గెలిపిస్తాయి.

### నిర్లక్ష్యంతో ఉంటే అసలుకు మోసం రావచ్చు..

– మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ

బీఆర్ఎస్ నాయకులు భారీ మెజార్టీ తెస్తామని చెబుతూ తాము చేయాల్సిన పనులు మర్చిపోతే అసలుకే మోసం వస్తుంది. నేడు చెబుతున్నానని ఎవరూ అన్యదా భావించొద్దు. ఎన్నికలను గెలిచేందుకు స్టేట్‌మెంట్లతోపాటు బూత్ లేవల్‌లో పనిచేయాలి. ఎన్నికలంటే మందబలం కాదు బుద్ధిబలం. మునుగోడులో పటాన్‌చెరు నాయకులు సమష్టిగా పనిచేసి అక్కడ వారికి కేటాయించిన బూత్‌లలో మంచి మెజార్టీ ఇచ్చారు. అలానే పటాన్‌చెరులోనూ ప్రతి నాయకుడు తానుండే ప్రాంతంలోని బూత్‌లను దత్తత తీసుకోవాలి. అప్పుడే మనం కోరుకునే భారీ మెజార్టీ వస్తుంది.



పటాన్‌చెరు సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణుల సందడి



బీజేపీ అధికార ప్రతినిధి చింతల్‌గట్టు సుధీర్‌కుమార్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ అధికారి ప్రతినిధి

జహీరాబాద్/ కోహీర్, నవంబర్ 8: సంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి చింతల్‌ఘాట్ సుధీర్‌కుమార్, కోహీర్ మండల మాజీ ఎంపీపీ జంపల అనీత ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం హైదరాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో గులాబీ కండవా కప్పుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరేశ్ రెడ్డి, నర్సింహులు, మన్సూర్ అలీ తదితరులున్నారు.

# నామినేషన్ దాఖలు చేసిన.. బీఆర్ఎస్ అభ్యర్థులు

### నారాయణఖేడ్‌లో భూపాల్‌రెడ్డి, అందోల్‌లో క్రాంతి కిరణ్ రెండు సెట్లతో నామినేషన్

నారాయణఖేడ్, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బుధవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, ఒక సెట్‌ను భూపాల్‌రెడ్డి స్వయంగా రిటర్నింగ్ అధికారి వెంకటేశ్‌కు అందజేశారు. భూపాల్‌రెడ్డి పేర మరో సెట్ నామినేషన్‌ను ఎమ్మెల్యే తనయుడు మహారెడ్డి రోషన్‌రెడ్డి దాఖలు చేశారు. మంగళవారం వరకు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కాగా, బుధవారం ఒక్కరోజే దాఖలైన ఐదు సెట్ల నామినేషన్లతో మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటేశ్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ తరపున సురేశ్ శెట్కార్, బీఎస్పీ నుంచి మహ్మద్ అల్లావుద్దీన్‌తోపాటు పుటాల విఠల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లను దాఖలు చేసినట్లు వివరించారు.

### రెండు సెట్ల నామినేషన్ సమర్పించిన క్రాంతికిరణ్

అందోల్, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నికలకు అందోల్ నియోజకవర్గం నుంచి ఆరో రోజు బుధవారం 5 నామినేషన్లు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి పాండు తెలిపారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, అల్లాదుర్గం ఎంపీపీ అనిల్‌రెడ్డి, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, లింగాగౌడ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. అంతకుముందు జోగిపేటలో జోగినాథస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాహుల్‌కిరణ్, జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాశీనాథ్, నాయకులు వీరభద్రరావు, సాయికుమార్ క్రాంతికిరణ్ తరపున మరోసెట్ నామినేషన్ వేశారు. బీఎస్పీ తరపున ముప్పారం ప్రకాశ్, బీపీపీ నుంచి కాసాల పవన్, మరో ఇద్దరు స్వతంత్రులుగా నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద నోడల్ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో సీఐ నాగరాజు, ఎస్సై అరుణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.



నామినేషన్ అనంతరం ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి తదితరులు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

# నిబంధనలు కచ్చితంగా పాటించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 8: ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ పూర్తి అవగాహనతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, వివిధ బృందాలతో సాధారణ ఎన్నికల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈవీఎంల నిర్వహణపై, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తరువాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలో తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. రిటర్నింగ్ అధికారి పరిధిలోని అన్ని బృందాలకు ఆయా విధులపై అవగాహన కల్పించాలన్నారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ఇస్తున్న ఆయా అనుమతులను నిర్ణీత సమయంలోగా ఇవ్వాలని, తిరస్కరిస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు.

### సీ విజిల్ ఫిర్యాదులను పరిష్కరించాలి

సీ విజిల్ ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ మద్యం, నగదు, వస్తువులు తదితరాల రవాణా, పంపిణీపై ఆయా బృందాలు నిఘా పెంచాలని సూచించారు. ఫారం-6, 8 దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు సంబంధించి డీఎస్పీలు, ఆర్వోలు తుది నివేదిక ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్లకు ఫారం-12డీ ఇవ్వాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 20లోగా ఓటర్ సమాచార స్లిప్‌లను 100 శాతం పంపిణీ చేయాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నోడల్ అధికారులు, డీఆర్వో, రిటర్నింగ్ అధికారులు, ఆయా బృందాలు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.